ఎస్ఈబి డిఎస్ఈఓ సుబ్బారాజుకు ప్రశంసాపత్రం

ప్రశంసా పత్రం అందుకున్న ఎస్ఈబి డిఎస్ఈఓ ఏవి సుబ్బా రాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కనబరచిన అత్యుత్తమ పనితీరుకు గాను ఎస్ఈబి డిఎస్ఈఓ ఏవి.సుబ్బారాజు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఎన్నికల విధులలో చట్టాన్ని అమలు చేయడంలో, సాంకేతికతను, ప్రజాభాగస్వామ్యాన్ని సమర్థవంతంగా ఉపయోగించడంలో కృషి చేసిన చిత్తూరు జిల్లా ఎస్ఈబికి రన్నర్-అప్-ట్రోఫీ పురస్కరణ, 16 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేశారు. ఏవి.సుబ్బారాజు ఇతర అధికారులు, సిబ్బందిని ఎస్పీ విఎన్.మణికంఠ చందోలు అభినందించారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ విధులలో కనబరచిన అత్యుత్తమ పనితీరుకు గాను స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో రాష్ట్ర కమిషనర్ ఎం.రవి ప్రకాష్ చేతుల మీదుగా మంగళగిరిలోని ఎస్ఈబి ఆఫీస్‌లో ఏ.వి. సుబ్బారాజు గురువారం ప్రశంసా పత్రంతో పాటుగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన జిల్లా ఎస్ఈబి వారికి పురస్కరించిన రన్నర్-అప్-ట్రోఫీని అందుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ ముందుగా ప్రశంసాపత్రం అందుకున్న అందరికీ పేరు పేరున అభినందనలు తెలిపారు. మద్యం, మాదక ద్రవ్యాలు, ఇతర అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన చట్టాలను అమలు చేయడం వంటి కీలక బాధ్యతతో నియమితమై, తమ దఢమైన చర్యల అమలు విధానంలో అద్భుతమైన కృషి, వైవిధ్యాన్ని ప్రదర్శించారని తెలిపారు. జిల్లా డిఎస్ఈఓ (డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్) మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ఎస్ఈబి పోలీసులు ఇంతటి పేరును సంపాదించదానికి జిల్లా ఎస్పీ సహాయ సహకారాలు, ఎప్పటికప్పుడు సందర్భాన్ని బట్టి సూచనలు చేస్తూ ప్రోత్సాహించిన ఎస్పీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఆదేశాలను పాటించి జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లు, వాహన తనిఖీలు, ఇతర విధినిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించకుండా రాష్ట్రంలో తమదైన ముద్ర వేసుకున్న, తనతో పాటుగా ప్రశంసా పత్రాలు అందుకున్న అందరికి అభినందనలు తెలియజేసారు.

గోదాములో
ఈవిఎంలు భద్రపరిచాం: డిఆర్ఓ

గోదాముల్లో ఈవిఎంలు భద్రపరుస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్షన్స్ గోదాములో ఈవియంలు భద్రపరచడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి జిల్లా కలెక్టరేట్‌లోని ఎలక్షన్స్ గోదాములో సార్వత్రిక ఎన్నికల 2024లో ఉపయోగించిన ఈవియంలు భద్రపరచడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా చిత్తూరు జిల్లాలో చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మే 13న పోలింగ్‌కు, జూన్ 4న ఓట్లు లెక్కింపుకు సంబంధించి ఉపయోగించుకున్న ఈవియంలు స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని ఎలక్షన్ గోదాములలో రాజకీయ పార్టీల సమక్షంలో భద్రపరిచి సీల్ వేయడం జరిగిందని తెలిపారు. బిసి కార్పొరేషన్ ఈడి మరియు, ఈవియంల మేనేజ్మెంట్ నోడల్ అధికారిణి శ్రీదేవి, తెలుగుదేశం పార్టీ నుంచి సురేంద్ర కుమార్, వైఎస్సార్‌సీపీ నుంచి ఉదయ్, బిఎస్‌పి నుంచి ఉదయ కుమార్, డిటిలు సరితా, శోభ, గిరిజ, బిందు పాల్గొన్నారు.

మలేరియా వారోత్సవాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి ఛాంబర్‌లో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు సంయుక్తంగా సబ్ యూనిట్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. జూన్ నెలమొత్తం మలేరియా నివారణ వారోత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతి గ్రామంలో దోమలు పెరుగుదలను నివారించాలని, నిల్వ ఉన్న మురుగు నీటి శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును రక్తపరీక్ష ద్వారా నిర్ధారణ చేసి పాజిటివ్ వస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స చేస్తారని తెలిపారు. మలేరియా జ్వరం వచ్చిన చుట్టుపక్కల 50 ఇండ్లలో సర్వే చేసి లార్వా క్రిమినాశిలను స్ప్రే చేయాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించటం, దోమతెరలు వాడటం, కిటికీలకు మెస్లు కొట్టుకోవడం, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూడటం, వేపాకు పొగ వేసుకోవటం శరీరాన్ని కప్పి ఉంచే బట్టలు వేసుకోవడం లాంటివి ప్రజలకు చెప్పి అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే అన్ని హాస్టల్స్, స్కూల్స్‌లో క్రిమినాశలను స్ప్రే చేసి స్కూల్ తెరవక ముందే పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాలన్ని సబ్ యూనిట్ అధికారులు పర్యవేక్షించి రిపోర్టులు జిల్లాకు పంపాలని తెలిపారు. ఏఎంఓ శ్రీనివాసరెడ్డి, జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

5 రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించి, చురుగ్గా కదులుతున్నాయి. వీటి ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. వేసవి ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తూ ప్రజలకు వాతావరణశాఖ చల్లటి కబురు అందించింది. ఐదు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రుతుపవనాల రాకతో జిల్లాలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, నైరుతి రుతుపవనాలు రాబోయే 3 నుంచి 4రోజులలో కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని ప్రాంతాలలో ప్రవేశించే అవకాశం ఉందన్నారు. నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్న ఉపరితల ఆవర్తనం ఈ ఉదయం దక్షిణ ఆంధ్రప్రదేశ్ పరిసర ప్రాంతాలలో సగటు సముద్రమట్టానికి 3.1 నుంచి 4.5 కిలో మీటర్ల ఎత్తులో కేంద్రీకతమై ఉందని వెల్లడించింది వాతావరణశాఖ. మరోవైపు నేడు మరిన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

పంట పొలాలపై ఏనుగుల దాడి

- టమోటా పంటను తొక్కి నాశనం చేసిన ఏనుగులు
- మామిడి చెట్లు, డ్రిప్ పైపులు ధ్వంసం

ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన టమోటా పంట

ప్రజాశక్తి -సదుం: మండల పరిధిలోని చెరుకువారిపల్లిలో ఏనుగులు టమోటా పంటను తిని తొక్కి నాశనం చేశాయి. బుధవారం అర్ధరాత్రి చెరుకువారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పోతుంవారిపల్లి గ్రామానికి చెందిన వేముల ప్రకాష్ తనకున్న ఎకరా పంట భూమిలో టమోటాను సాగు చేసుకుంటున్నాడు. అయితే బుధవారం అర్ధరాత్రి రెండు ఏనుగులు పంటపొలంలోకి చొరబడి టమోటాలను తిని, తొక్కి ధ్వంసం చేశాయని వాపోయాడు. అలాగే అంతర్ పంటగా ఉన్న మామిడి చెట్లను విరిచి, డ్రిప్ పైపులను తొక్కి నాశనం చేశాయి. గురువారం ఉదయం రైతు పొలం వద్దకు వెళ్లగా ఏనుగుల దాడిని గుర్తించి అటవీశాఖ అధికారులకు తెలిపారు. గొల్లపల్లి బీట్ ఫారెస్టు ఆఫీసర్ మహేష్ పంట పొలంను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ఐరాల మండలం బీరప్ప చెరువు పరిసర ప్రాంతాల్లో మకాం వేసిన రెండు ఏనుగులు పంటలపై దాడులు చేస్తున్నాయని, సదరు రైతులు రాత్రి సమయాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని, ఒంటిరి ఎవరూ పొలం వద్దకు వెళ్ల వద్దని సూచించారు. అనంతరం పంట నష్టాన్ని అంచనా వేసి పై అధికారులు పంపుతామన్నారు.

మైన్స్ మావంటూ
పిఎల్ఆర్ ప్రాజెక్ట్‌లోకి చొరబాటు

- అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ప్రాజెక్టు వద్ద పోలీస్ పహారా: డీఎస్పీ

ప్రజాశక్తి- పుంగనూరు
మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిఎల్ఆర్ కంపెనీ నిర్వహిస్తున్న మైన్స్ తమకు సంబంధించింది అంటూ పట్టణానికి చెందిన కొందరు చొరబడ్డారు. విషయం తెలుసుకున్న పలమనేరు డిఎస్‌పి రఘువీర్ ప్రసాద్, అర్బన్ సీఐ రాఘవరెడ్డి హుటాహుటిన పిఎల్ఆర్ ప్రాజెక్ట్ వద్దకు చేరుకున్నారు. అనుమానితులుగా ఉన్న కొందరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ పట్టణానికి చెందిన కొందరు మైన్స్ తమకు సంబంధించినదని కొంతమంది యువతను తీసుకుని అక్కడికి వెళ్ళడం జరిగిందన్నారు. కంపెనీలో పనిచేసే సిబ్బంది పోలీసులు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తం కావడం జరిగిందన్నారు. మైన్స్‌కు సంబంధించి రికార్డులు ఏవైనా ఉన్నట్లయినా తమకు తెలపాలని, లేక కోర్టుకు వెళ్లాలి కానీ, జనంను పోగు చేసుకునే అక్కడికి వెళ్ళకూడదని తెలిపారు. తాము నిష్పక్షపాతంగా వ్యవహరించి న్యాయం చేస్తామన్నారు. అదుపులోకి తీసుకున్న యువకుల వివరాలతో పాటు, వారిపై గతంలో ఏమైనా కేసులు ఉన్నాయని పరిశీలిస్తున్నామని, అలాగే వారి తల్లిదండ్రులు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎలాంటి చిన్న సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. అంతేకానీ యువతను రెచ్చగొట్టి పెడదారి పట్టిస్తే మాత్రం పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి హెచ్చరించారు. పిఎల్ఆర్ ప్రాజెక్టు వద్ద పోలీసు బలగాలు ఏర్పాటు చేసినట్లు డిఎస్పీ తెలిపారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పలమనేరు డీఎస్పీ రఘువీర్ ప్రసాద్

ఎంపి దగ్గుమళ్లను అభినందించిన చంద్రబాబు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: టిడిపి అధినేత, ఆంధ్రప్రదేశ్‌కు కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని తన నివాసంలో నిర్వహించిన నూతనంగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ సభ్యుల సమావేశానికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు హాజరయ్యారు. 2లక్షల 25 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొంది, చరిత్ర తిరగరాసిన దగ్గుమళ్ళ ప్రసాదరావుని నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. అలాగే చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో పోలైన ఓట్ల గురించి కూడా చంద్రబాబు దగ్గుమళ్ళ ప్రసాదరావుని అడిగి తెలుసుకున్నారు. అనతి కాలంలోనే ప్రజాఆదరణ పొంది, వారి ఆశీస్సులు అందుకుని, పట్టుదల, కృషి తన ఆయుధాలుగా ఎంచుకొని, టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయపరచుకొని భారీ మెజారిటీని నమోదు చేసి చరిత్ర సృష్టించిన ప్రసాదరావుకి చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు.

నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్

ప్రజాశక్తి- ఐరాల: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్ గురువారం విజయవాడలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మురళీ మోహన్‌తో నారా లోకేష్ కొంతసేపు భేటీ అయ్యారు. వైసిపి కంచుకోట పూతలపట్టులో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగుర వేసిన మురళిమోహన్‌ను లోకేష్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

చంద్రబాబును కలసిన థామస్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: తెలుగు రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని తన నివాసంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ కలిశారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి నారా చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందించి కలిశారు. తనపై నమ్మకంతో గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీకి, కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి తమ కుటుంబం ఎప్పుడు రుణపడి ఉంటుందన్నారు.



కూటమి విజయం చారిత్రాత్మకం

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవులు, రఘు హర్షం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:
ఈ నెల 4వ తేదీన వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతాపార్టీల కూటమికి చెందిన అభ్యర్థులకు భారీ విజయాన్ని కల్పిస్తూ ప్రజలు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (ఏపీ ఎన్జీవో) అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవులు, రఘు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించనున్న నారా చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి అభ్యర్థుల విజయంలో చారిత్రాత్మక తీర్పులో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. తమ పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో పాటు, వారి కుటుంబ సభ్యుల ఓట్ల వినియోగం పట్ల ఉద్యోగులు చిత్తశుద్ధిని ప్రదర్శిస్తూ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. 5 లక్షలకు పైగా పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో అనేక ఇబ్బందులను తట్టుకొని తమ విజ్ఞతను ప్రదర్శిస్తూ 80 శాతంకు పైగా ఓట్లను కూటమి అభ్యర్థులకు పోల్‌చేసి ప్రజాతీర్పుకు మార్గదర్శకులయ్యారని అభినందించారు. రాష్ట్ర పాలనలో, ప్రజాస్వామ్యంలో ఉద్యోగుల పాత్ర కీలకమని, అలాంటి ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తే ఏం జరుగుతుందో ఇటీవల జరిగిన ఎన్నికలు రుజువు చేశాయన్నారు. ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వినియోగానికి సరైన ఏర్పాట్లు చేయడంతో పాటు, ఆయా ఓట్ల వినియోగంలో సాంకేతిక సమస్యలను పరిష్కరించడంలో ఎన్నికల అధికారులకు పూర్తి సహాయ, సహకారాలందించిన జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షన్మోహన్‌కు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ చిత్తూరు జిల్లా శాఖ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరించడంలో నూతనంగా ఏర్పడనున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అదే క్రమంలో ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించేలా నూతన రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

శాస్త్రోక్తంగా చక్రస్నానం

ధ్వజావరోహణంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం ఉదయం 9గంటలకు చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పల్లకి ఉత్సవం నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు పల్లకి వాహనంపై గ్రామవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చాడు. అంతకు ముందు ఆలయంలో మూలవిరాట్‌ను వేకువ జామున సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు, చూర్ణాభిషేకం చేపట్టారు. అనంతరం ఊరేగింపుగా స్కంధపుష్కరణీ వద్దకు చేరుకున్న చక్రతాళ్వార్, రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవర్లతో పాటు చక్రతాళ్వార్కు వేద పండితులు వేదమంత్రాల నడుమ స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. 9 గంటలకు చక్రతాళ్వార్కు వేదమంత్రోచ్ఛారణం నడుమ స్కంద పుష్కరిణీలో చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్కంధపుష్కరిణీ వద్దకు చేరుకుని చక్రస్నానాన్ని సందర్శించారు. పురష్కరిణీ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గజ ఈతగాళ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉభయ నాంచారులతో వేణుగోపాలుడు తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కంకణబట్టుర్ నారాయణం దాశరథికి టీటీడీ వారు ఆనవాయితీ ప్రకారం అందించిన పట్టువస్త్రాలను టీటీడీ అధికారులు బహూకరించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోముశేఖర్, ఆలయ అధికారి సురేష్ కుమార్, షరాబ్ బాబు సురేష్, వేదంపండితులు గోపాలాచారి, తరుణు కుమార్ స్వామి, రమేష్ స్వామి, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు. నేడు పుష్పయాగ మహోత్సవం ఆలయంలో శుక్రవారం పుష్పయాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు.

గెలుపోటములు సహజం

భౌతిక దాడులను ఎదుర్కొంటాం..
ఎంసి విజయానందరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమేనని ప్రజలు అధికారం ఇచ్చారంటూ వైసిపి అనుచరులపై భౌతికదాడులకు పాల్పడితే సహించేది లేదని వైసిపి చిత్తూరు నియోజవర్గ నాయకులు ఎంసి విజయానందరెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల్లో విజయం సాధించిన చిత్తూరు ఎంపి, ఎంఎల్ఏ దగ్గమళ్ల ప్రసాద్‌రావు, గురజాల జగన్మోహన్‌లను అభినందించారు. కౌంటింగ్ అనంతరం చిత్తూరులో వైసిపి అనుచరులపై ఓవ్యక్తి భౌతిక దాడులు, ఆస్తులు ధ్వంసం చేసే కార్యాక్రమాలను పాల్పడుతున్నారని దాడులను ఎదుర్కొంటామని హెచ్చరించారు. దాడులకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నా అరెస్టులు చేయడం లేదన్నారు. చిత్తూరు అభివృద్ధిను తాము ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గెలిచిన అభ్యర్థులు చిత్తూరు అభివృద్ధి చేయాలని అభివృద్ధికి తమ సహకారం ఉంటుందని తెలిపారు. సమావేశంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మార్కెట్ కమిటి ఛైర్మెన్ రాహుల్ రాజారెడ్డి, చుడా ఛైర్మెన్ పురుషోత్తంరెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంసి విజయానందరెడ్డి

ప్రతి గురువారం బిసిజి టీకాలు

డిఎం అండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగర పరిధిలోని సత్యనారాయణపురం అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం బీసీజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని డిఎం అండ్ హెచ్‌ఓ ప్రభావతి దేవీ ఆకస్మిక తనిఖీ చేశారు. క్షయ (టిబి) వ్యాధి లేని భారతదేశం లక్ష్యసాధన కొరకే వయోజన బిసిజి టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టినదని తెలిపారు. భవిష్యత్తులో టిబి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా బిసిజి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఇవి చాలా సురక్షితమైనదని, క్షయకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి గురువరాం బిసిజి టికాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారని ఎలాంటి అనుమానాలకు తావు లేకుండాఅందరూ కచ్చితంగా టీకాలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నిత్యసాయి శృతి, యుపిహెచ్‌సి స్టాప్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిసిజి వ్యాక్సిన్ వేసుకోవాలి

జిల్లా అదనపు వైద్యాధికారి వెంకటప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు బిసిజి వ్యాక్సిన్ వేసుకోవాలని జిల్లా అదనపున వైద్యాధికారి వెంకట ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని గుంతూరు, తగ్గువారిపల్లి ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న బిసిజి వాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధులకు నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీజీ వ్యాక్సినేషన్ చేపడుతున్నదని, వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు తగిన మందులు ప్రభుత్వమే సరఫరా చేస్తున్నదని తెలిపారు. బిపి, షుగర్ ఉన్నవారు తప్పక బిసిజి వ్యాక్సిన్ వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఓ రమేష్‌బాబు, రమాదేవి, హరిత, హిందూ, రోజారమణి, ఆశా వర్కర్లు మునెమ్మ, పుణ్యవతి, లత పాల్గొన్నారు.

16న యుపిఎస్సి సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న యుపిఎస్సి సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల నిర్వహణ కోసం అన్ని చర్యలు తీసుకుంటామని యూపీఎస్సీ అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ వివరించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందలి డిఆర్ఓ ఛాంబర్ నుండి ఈ నెల 16 న జరగనున్న యుపిఎస్సి సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల నిర్వహణపై యుపిఎస్‌సి అధికారులు నిర్వహించిన గూగుల్ మీట్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా యుపీఎస్సీ అధికారులు మాట్లాడుతూ ఈనెల 16 వ తేదీన యుపిఎస్సి సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష జరగనున్న నేపథ్యంలో ఇందుకు సంబందించిన ఏర్పాట్లను సంబందిత అధికారులు పూర్తి చేయాలని అన్నారు. డి ఆర్ ఓ వివరిస్తూ ఈ పరీక్షకు తిరుపతి జిల్లాలో 11 సెంటర్లు కేటాయించడం జరిగిందని, మొత్తం 5518 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. 11 మంది తహశీల్దార్లను లైజన్ అధికారులుగా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, 144 సెక్షన్ అమలు, మెడికల్ క్యాంపులు, నిరంతర విద్యుత్, తాగు నీరు, విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తీసుకుని వెళ్ళేందుకు బస్సులు ఏర్పాటు, తదితర ఏర్పాట్లు చేయనున్నామని వివరించారు.

‘ఆరణికి మంత్రి పదవి ఇవ్వాలి’

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తిరుపతిలో అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన ఆరణి శ్రీనివాసులకు మంత్రి పదవి ఇవ్వాలని జనసేన పార్టీ, బలిజ సంఘం నేతలు గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కోరారు. జనసేన నాయకులు శ్రీకాంత్, పూర్ణ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో తిరుపతి నుండీ విజయం సాధించిన బలిజ కులానికి చెందిన ఆరణికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు. ఆరణి శ్రీనివాసులకు తిరుపతి స్థానం కేటాయించడంతో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌కు, భారీ మెజార్టీతో విజయం అందించిన తిరుపతి ఓటర్లకు కృతజ్ఞతులు తెలిపారు. విశ్వనాథ్, రెడ్డిగుంట కిషోర్‌లు, ఓఎం రామదాస్, బాలాజీ పాల్గొన్నారు.

సంబరాలు జరుపుకున్న తెలుగు తమ్ముళు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: రాష్ట్రంలోని కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం, చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారం దక్కించుకోవడం తమకు చాలా సంతోషంగా ఉందని మండలంలోని తెలుగు తమ్ముళు సంబరాలు జరుపుకున్నారు. గురువారం గంగినాయన పల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ ఎం.రెడ్డమ్మ, మాజీ సర్పంచ్ ఆర్.రెడ్డప్ప, వెంకటేష్, మండల అధ్యక్షులు బిఎం.కిషోర్ గౌడ్ నివాసానికి చేరుకొని కేక్ కట్ చేసి ఒకరికొక్కరు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. పి.రఘుచంద్ర గుప్తా, రంజిత్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లె గ్రామంలో డాక్టర్ థామస్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ధనగిరిరెడ్డి తెలుగు తమ్ముళ్లు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ డాక్టర్ థామస్ విజయం ప్రజల విజయమని పేర్కొన్నారు. జీడి నెల్లూరులో తెలుగుదేశం జెండా ఎగురవేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పి.పవన్ రెడ్డి, పి.దినేష్ రెడ్డి, ఎన్.శ్రావణ్ రెడ్డి, ఎస్.ప్రవీణ్ కుమార్, పి.మహేష్ రెడ్డి, ఉమాపతి, నాగరాజు, మహేంద్ర, దేవేంద్ర, సూరి, మోహన్ పాల్గొన్నారు.

ఎన్వీ ప్రసాద్‌ను కలిసిన ఆర్కాట్ కృష్ణప్రసాద్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గురువారం ఉదయం 11 గంటలకు తిరుపతి జయశ్యాం థియేటర్‌లోని కార్యాలయంలో ప్రముఖ నిర్మాత ఎన్వీ ప్రసాద్‌ను రాష్ట్ర బలిజసేన నాయకులు, జనసేన నాయకులు ఆర్కాట్ కష్ణప్రసాద్ మర్యాదపూర్వకంగా కలసి ఎన్నికలలో విజయం సాధించినందుకు పరస్పరం కతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలలో కూటమి విజయదుంధిబి మోగించిందని, ముఖ్యంగా తిరుపతిలో అరణి శ్రీనివాసులుకి అధిక మెజారిటీ రావడానికి అన్ని వర్గాలు కషిచేశాయని, అందులో ముఖ్యపాత్రను ఎన్వీ ప్రసాద్ పోషించడం ఆనందంగా ఉందని తెలిపారు. బలిజసేన కార్యవర్గం ఎన్వీ ప్రసాద్‌కు పుష్పగుచ్చం అందించి వెంకన్న ప్రతిమను బహూకరించారు. ఈ కార్యక్రమంలో జనసేన, బలిజసేన నాయకులు బెల్లంకొండ సురేష్, చేరుకుల నీలాద్రి, సురేష్, బాసికర్ల రఘు, వినయ్ పాల్గొన్నారు.

ఏపీ సీఎంఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్మెంట్ నేచురల్ ఫామింగ్ (ఏపీసీఎంఎఫ్) సిఐటియు అనుబంధం చిత్తూరు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతి యూత్ హాస్టల్‌లో గురువారం తిరుపతి జిల్లా సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, జిల్లా నాయకులు పి. మునిరాజా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉండాలని, కార్మిక సమస్యలను సంఘం పరిష్కరిస్తుందని వివరించారు. గౌరవాధ్యక్షులుగా కందారపు మురళి, అధ్యక్షులుగా సిహెచ్ రాధాక్రిష్ణ, ప్రధాన కార్యదర్శిగా కె.జయతుంబి, కోశాధికారిగా కె.వీర రాఘవయ్య, జిల్లా కమిటీ సభ్యులుగా 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు శ్రీధర్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ పదవులకు రాజీనామా

ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కార్పొరేషన్ల ద్వారా పదవులు పొందిన రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా వడ్డెర, కురబ, ఈడిగ గౌడ కార్పొరేషన్ల డైరెక్టర్లు మొగులేశ్వర, అమర్నాథ్, ఎల్లప్పలు తమ పదవులకు రాజీనామా చేస్తూ ఆపత్రాన్ని రాష్ట్ర కార్యదర్శికి పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఓటమి చెందడంతో తమ పదవులకు ముందస్తు రాజీనామా చేస్తున్నామని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ర్యాలీగా వస్తున్న ఎంఈఓ ఆంజనేయులు శెట్టి

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: బాలకార్మికుల చట్టం 1986 ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలు దుకాణాలలో పని చేయకూడదని, బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాధికారి ఆంజనేయులు శెట్టి, సీఐ మారుతి శంకర్ తెలిపారు. మండల కేంద్రంలో బాలకార్మికులు ఎక్కడా పని చేయకూడదని, ప్రతి ఒక్కరూ చిన్న వయసు నుండే చదువుకోవాలని 14 సంవత్సరాల లోపు పిల్లలను వాణిజ్య సముదాయాలలో, దుకాణాలలో పనికి చేర్పించుకోకూడదని అన్నారు. ఎవరైనా పిల్లలను దుకాణంలో పనికి పెట్టుకున్నట్లయితే ఆ యజమానులకు కఠినశిక్ష విధించబడునని తెలిపారు. అనంతరం జీడీ నెల్లూరు పోలీస్ స్టేషన్ నుండి గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని దుకాణాల వద్దకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిసిపియు సిబ్బంది మురళి, ఉమాదేవి, సబిత, పూర్ణచంద్ర, పోలీసు సిబ్బంది గోపాల్ బాబు, గురుస్వామి రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు

గంగాధర నెల్లూరు టిడిపి కార్యాలయంలో గురువారం మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు శాలువా కప్పి పూల బొకేలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, నాయకులు మోహన్ నాయుడు, లోకేష్ నాయుడు, శేఖర్, జీవరత్నం, ఉలగనాథన్, సంపత్, రాజేంద్ర శెట్టి, ప్రకాష్, జాన్ పాల్గొన్నారు.

నందిమంగళం దళితవాడలో మెడికల్ క్యాంపు నిర్వహించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పురపాలక సంఘం పరిధిలోని నందిమంగళం దళితవాడలో తాగునీరు కలుషితమై వాంతులు, విరేచనాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అధికారులు స్పందించి మెడికల్ క్యాంపు నిర్వహించాలని సిపిఎం డివిజన్ నాయకులు వెంకటేష్ మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. మురుగుకాల్వలు శుభ్రం చేయాలని, శుభ్రమైన తాగునీటిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు విజయ్, సుబ్రమణ్యం పిళ్లై, శివ, వెంకటేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు ఆదర్శం : పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం: కాబోయే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును గురువారం మంగళగిరిలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన తనయుడు పులివర్తి వినీల్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ ఎన్నికల్లో సంచలన విజయంతో చరిత్ర సష్టించిన విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు అని పులివర్తి నాని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు దేశానికి ఈ-గవర్నెన్స్ పరిచయం చేశారని, డిజిటలైజేషన్ కు ఆద్యుడని పేర్కొన్నారు. ఐటీ విషయంలో ఏమి చేశారో, ఆయన ఘనత ఏమిటో ప్రపంచానికి తెలుసునని పేర్కొన్నారు. ఆయన ఆశీస్సులతో చంద్రగిరి అభివద్ధికి కషి చేస్తానని పులివర్తి నాని అన్నారు. 30 ఏళ్ల తర్వాత చంద్రగిరిలో టీడీపీ జెండా ఎగురవేసిన పులివర్తి నానిని చంద్రబాబు అభినందించారు.

జగన్‌ను కలిసిన ఎంపి డాక్టర్ గురుమూర్తి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి గురువారం విజయవాడలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి రెండోసారి ఎంపీగా గెలుపొందారు. ప్రజా సమస్యలపై రాజీ లేని పోరాటం చేయాలని జగన్ ఎంపీ డాక్టర్ గురుమూర్తికి సూచించారు.

ఆ ముగ్గురికీ క్యాబినెట్‌లో చోటు...?

ఎన్.అమరనాథరెడ్డి, పలమనేరు

కలికిరి మురళీమోహన్, పూతలపట్టు

బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కూటమి ఊహించని విధంగా సీట్లు సాధించడంతో చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం నుంచి గెలుపొందిన మాజీ మంత్రి అమరనాథరెడ్డికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. అదే జిల్లాలో కుప్పం నుంచి 48వేల మెజార్టీతో గెలుపొందిన నారా చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రిగా ఈనెల 12న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సామాజిక సమీకరణల నేపథ్యంలో అమరనాథరెడ్డికి అవకాశం కనిపిస్తోంది. చిత్తూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి నుంచి గెలుపొందిన వారిలో ‘రెడ్డి’ సామాజిక వర్గం అమరనాథరెడ్డే. గతంలో ఆయన పరిశ్రమల శాఖలో పనిచేశారు. ముఖ్యంగా నారా లోకేష్ జరిపిన యువగళం పాదయాత్రలో రాయలసీమ జిల్లాలో అమరనాథరెడ్డి వెన్నుదన్నుగా నిలిచారు. నారా లోకేష్ సైతం టిడిపి అధికారంలోకి వస్తే అమరనాథరెడ్డికి కీలకమైన మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని ధీటుగా ఎదుర్కొన్న వారిలో అమరనాథరెడ్డి ఒకరు. ఈ నేపథ్యంలో మంత్రి పదవి గ్యారంటీగా ఇస్తారని చర్చ నడుస్తోంది. అలాగే చిత్తూరు జిల్లాలోనే ఎస్‌సి సామాజిక వర్గానికి ఇచ్చే అవకాశం లేకపోలేదు. జీడీనెల్లూరు నుంచి థామస్, పూతలపట్టు నుంచి డాక్టర్ మురళీమోహన్ గెలుపొందారు. వీరిద్దరిలో ఒకరికి మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉంది. పేదరికం, సామాన్యుని జీవితం నుంచి జర్నలిస్టుగా ఎదిగిన డాక్టర్ కలికిరి మురళీమోహన్‌కే ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. నగరి నుంచి గెలుపొందిన గాలి భానుప్రకాష్, గురజాల జగన్మోహన్ ఇద్దరూ ‘కమ్మ’ సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో వీరికి అవకాశం లేదు.

తిరుపతి జిల్లాలో బొజ్జల సుధీర్‌కు

తిరుపతి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. సూళ్లూరుపేట, గూడూరు, సత్యవేడు ఎస్సీ రిజర్వుడ్. ఈ మూడు చోట్ల నెలవల విజయశ్రీ, పాశిం సునీల్‌కుమార్, ఆదిమూలం విజయం సాధించారు. తిరుపతి జిల్లాలో ఎస్సీ సామాజికవర్గానికి మంత్రి పదవి లభిస్తే కోనేటి ఆదిమూలం, పాశిం సునీల్‌కుమార్‌లకు అవకాశాలు ఉన్నాయి. నెలవల విజయశ్రీ తొలిసారి ఎంఎల్‌ఎ కావడంతో ఆమెకు ఇవ్వకపోవచ్చు. చంద్రగిరి పులివర్తి నాని కమ్మ సామాజికవర్గం కావడం,జనసేన తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు గెలుపొందడంతో టిటిడికి సంబంధించిన బోర్డు ఛైర్మన్ కొణిదెల నాగబాబుకు ఇస్తే ఆ పార్టీకి మంత్రి పదవి ఇవ్వకపోవచ్చు. తిరుపతి ఎంఎల్‌ఎ టిటిడి ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఆరణి శ్రీనివాసులుకు అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ‘రెడ్డి’ సామాజికవర్గం నుంచి మాజీ మంత్రి బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డి తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడంతో మంత్రి పదవి వచ్చే అవకాశం కనిపిస్తోంది. అలాగే టిటిడి అవినీతి అక్రమాలపై ఎక్కువ పోరాటం చేసిన కాంగ్రెస్ నుంచి ఇటీవలే బిజెపి తీర్థం పుచ్చుకున్న నవీన్‌కుమార్‌రెడ్డికి టిటిడి బోర్డులో ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది.

కక్షలకు దూరం.. అభివృద్ధే ప్రధానం..

మండల టిడిపి అధ్యక్షులు రంగనాథ్

ప్రజాశక్తి- వి కోట: రాష్ట్రంలో ఇంత భారీ మెజారిటీ ఇచ్చిన ప్రజాభిష్టాన్ని గుర్తించి, కక్షా రాజకీయాలకు పాల్పడకుండా అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు ముందుకెళతాయని మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్ తెలిపారు. మండలంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గడిచిన ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలోని అరాచక పాలనలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నరని తెలిపారు. వైసిపి పాలనపై విసిగిన ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆదరించి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేలను గెలిపించారన్నారు. పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా అమర్నాథరెడ్డికి భారీ మెజార్టీ అందించెందుకు కృషి చేసిన టిడిపి, బిజెపి, జనసేన పార్టీ నాయకులకు, అభిమానులకు ఓటర్లకు రుణపడి ఉంటామన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం తమపై తప్పుడు కేసులు పెట్టి తమ కార్యకర్తలపై దాడులకు పాల్పడి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయితే ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిందని మేము మీరు చేసినట్ల మూర్ఖపు పనులు చేయమని రాజకీయం అంటే కేవలం ప్రజలకు సేవ చేయాలే గాని ఇలా నాయకులపై కేసులు పెట్టడం కాదని మరోసారి నిరూపిస్తామన్నారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు అరాచకాలకు పాల్పడవద్దని పిలుపునిచ్చారు. టిడిపి నేతలు చౌడప్ప, రాంబాబు, ఈశ్వర్ గౌడ్, మండల యూత్ అధ్యక్షులు ధీరజ్, శబరిష్. నారాయణస్వామి, వెంకట రామప్ప, హరినాథ్ రెడ్డి, నాగరాజ్. సుబ్రహ్మణ్యం శెట్టి పాల్గొన్నారు.

టీటీడీ ఈవో ధర్మారెడ్డి పాస్‌పోర్ట్ సీజ్ చెయ్యండి : జనసేన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

టిటిడి ఈఓ ధర్మారెడ్డి పాస్పోర్టును వెంటనే సీజ్ చేయాలని, అతను దేశం వదిలి పారిపోకుండా లుక్ అవుట్ నోటీసులు ఇవ్వాలని తిరుపతిలో సిఐడి అధికారులకు జనసేన పార్టీ ఇన్చార్జ్ కిరణ్ రాయల్ ఫిర్యాదు చేశారు. స్థానిక పద్మావతి పురం లోని సిఐడి కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం ఈఓ గా గత ఐదు సంవత్సరాలుగా ఎలాంటి అర్హత లేకపోయినా, ఐ.ఏ.ఎస్. కాకపోయినా, గత అధికార పార్టీ అండదండలతో తి.తి.దే. తిరుమలలో ఈఓ గా వుండి అనేక అవినీతి కార్యక్రమాలకు ఈవో ధర్మారెడ్డి పాల్పడ్డారన్నారు. తిరుమలలో స్వామివారి నగలు, ఆభరణాలు, శ్రీవాణి ట్రస్టుకు సంబంధించిన ఎన్నో అవినీతి కుంభకోణాలు చేసి, టీటీడీ నిధులలో ఎన్నో గోల్మాల్ చేసి, భక్తులు శ్రీవారికి సమర్పించిన హుండీ కానుకలపై సరైన లెక్కలు చూపకుండా, ఈరోజు ప్రభుత్వం మారగానే సెలవు పెట్టి దేశం వదిలి వెళ్లిపోవడానికి ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు.

ధర్మారెడ్డి అవినీతి లెక్కలు చాలా తేలాల్సి ఉందని, ఆయన విదేశాలకు పారిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి పాస్ పోర్ట్ సీజ్ చేసి, లుక్ అవుట్ నోటీసులు ఇవ్వాలని, తిరుమల టోల్ గేట్ వద్ద నిఘా పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు రాజారెడ్డి, సుభాషిని, సుమన్ బాబు, మునస్వామి, కిషోర్, ఆది, సాయి, పురుషోత్తం, రాజేంద్ర, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో ఎస్పీ తనిఖీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు చంద్రగిరి సబ్ డివిజన్, చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన కొటాల, కూచువారిపల్లి, రంగంపేట, శేషాపురం, కందుల వారి పల్లి, చిన్న రామాపురం, భీమవరం గ్రామాలను గురువారం సందర్శించారు. ఈ గ్రామాల్లో వున్న పోలీస్ పికెట్లను తనిఖీ చేస్తూ విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ ముచ్చటించారు. ఏమైనా అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే పై అధికారులకు సమాచారం అందజేయాలని సూచనలిస్తూ, అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి కులశేఖర్, ఏఆర్ డిఎస్పి రవీంద్ర రెడ్డి, చంద్రగిరి సీఐ రామయ్య, ఎస్సై అనిత,పాల్గొన్నారు.

పోలీసులు ఫ్లాగ్ మార్చ్

ఎలక్షన్ కౌంటింగ్ అనంతరం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట అర్బన్ పోలీసులు సమస్యాత్మక ప్రాంతాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తుగా నిలువరించాలనే ముఖ్య ఉద్దేశంతో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్, రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగుట్ట వారిపల్లి, సుబ్బయ్య గుంట,కుమ్మరపల్లి కరకంబాడి గ్రామలలో పరిసర ప్రాంతాలలో సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో గురువారం ఉదయం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

క్రైం న్యూస్

తోపుచేనులో చోరీ

- మహిళ కాళ్ళు చేతులు కట్టేసి దాడి
- 40 గ్రాముల బంగారం, లక్ష 30 వేలు నగదు తస్కరింపు
- దుండగులను వెంటాడి ఒకరిని పట్టుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- శాంతిపురం:

గుర్తు తెలిని ఆరుగు దుండగులు అర్ధరాత్రి ఓ మహిళ ఒంటరిగా ఉన్న ఇంట్లో చొరబడి దాడి చేసి కాళ్ళు చేతులు కట్టేసి మెడలో ఉన్న 40 గ్రాముల బంగారు తాళిబొట్టు, లక్ష 30 వేల నగదును, ఒక ద్విచక్రవాహనం (స్కూటీ) సినీ పక్కీలో తస్కరించిన సంఘటన శాంతిపురం మండలం తోపుచేను గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. బాధితరాలు షర్మిల తెలిపిన వివరాలు ప్రకారం.. తోపుచేను గ్రామానికి చెందిన యువరాజు అలియాస్ పళని తన వ్యవసాయ పొలాల వద్ద నివాసం ఉంటున్నారు. ఇంటి యజమాని యువరాజు వృత్తిరీత్యా సింగపూర్‌లో ఉన్నాడు. ఇంట్లో ఆయన భార్య షర్మిల, కుమార్తెలు కావ్య, మనుప్రియ, కుమారుడు తనీష్‌లు ఉంటున్నారు. పెద్ద కుమార్తె కావ్య ఉద్యోగ రిత్యా బెంగుళూరులో ఉంటుంది. కుమారుడు తిరుపతిలో చదుతున్నాడు. చిన్న కుమార్తె తమిళనాడులో డిగ్రీ చదువుతుంది. కళాశాలలకు సెలవు కావడంతో వారు ఇంటికి వచ్చారు. రోజులాగే ఇంటి కాంపౌండ్ గేటుకు తాళాలు వేసి ద్విచక్ర వాహనంలో బండి తాళాలు అందులోనే ఉంచి బయటే పెట్టేవారు. బుధవారం కూడా అలాగే బండిని బయటపెట్టి కుమారుడు తనీష్ ఇంటి మిద్దెపైన ఉన్న రూమ్లో ఉన్నాడు. అర్ధరాత్రి తలుపు తట్టడంతో కొడుకు అనుకొని ఇంటి తలుపులు తీసింది షర్మిల. మొహానికి ముసుగులు, చేతులకు తొడుగులు ధరించిన ఆరుగురు దుండుగులు ఒక్కసారిగా ఇంట్లోకి చొరబడ్డారు. ఆమె మెడ పట్టుకుని నోట్లో గుడ్డులు కుక్కి కాళ్ళు చేతులు కట్టేశారు. వారి వద్ద నుండి తప్పించుకునే ప్రయత్నం చేయడంతో వారు ఆమెపై దాడి చేశారు. మెడలో ఉన్న 40 గ్రాములు బంగారు తాళి బొట్టు లాక్కొన్నారు. తరువాత బీరువాలోని లక్షా 30వేల రూపాయల నగదును తీసుకున్నారు. దుండగులు చేస్తున్న శబ్దానికి రూములో నిద్రిస్తున్న కుమార్తె మనుప్రియ లేచి చూడగా దుండగులు కనిపించారు. భయంతో తన రూముకి వెళ్లి గడియ వేసుకుంది. దుండుగులు కూడా యువతి ఉన్న రూమ్‌కి బయట నుంచి గడియ పెట్టారు. వెంటనే మిద్దెపైన ఉన్న తమ్ముడు తనీష్‌కు ఫోన్ చేసింది, అతను కిందికి వచ్చే సరికి దుండుగులు వారి ద్విచక్ర వాహనాలతో పాటు షర్మిల స్కూటీ బండిని తస్కరించారు. తనీష్ ఇంట్లో దొంగలు పడ్డారని గట్టిగా కేకలు వేయడంతో పాటు రాళ్ళబూదుగూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేకలు విన్న చుట్టుపక్కల బంధువులు, గ్రామస్తులు పరుగున ఇంటి వద్దకు చేరుకొన్నారు. దారిలో వారు దుండగులను గ్రామస్తులు, వెంబడించారు. కొంతదూరం వెళ్లిన దుండగులు ఒక్కొక్కరు ఒక్కో దిక్కున వెళ్లిపోయారు. గ్రామస్తులు కూడా వారిని వెంబడించారు అందురు తప్పించుకోగా వారిలో ఒక్కడు మాత్రం దండికుప్పం సబ్‌స్టేషన్ వద్ద పట్టుబడ్డాడు. అతని పట్టుకుని విచారిస్తుండగా సమాచారం తెలుసుకున్న రాళ్ళబూదుగూరు ఎస్సై సుమన్ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. తన వద్ద ఉన్న బ్యాగును చెక్ చేయగా అందులో పెద్దపెద్ద రాడ్లు, కత్తులు, బీరువాలు, తలుపులు తెరిచే రాడ్లు ఉన్నాయి. వెంటే అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దుండుగుల చేతిలో గాయపడిన షర్మిలను ఆసుపత్రికి తరలించారు. గురువారం కుప్పం రూరల్ సిఐ ఈశ్వర్రెడ్డి, ఎస్సై సుమన్ తన సిబ్బందితో సంఘటన స్థలంకు వెళ్లి పరిశీలించారు. సాయంత్రం చిత్తూరు క్లూస్ టీం వెళ్లి ఇంట్లో పరిశీలించారు. బాధితురాలు షర్మిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుమన్ తెలిపారు.

టిడిపి నాయకుడిపై వైసిపి దాడి

ప్రజాశక్తి- గుడుపల్లి: మండలం సోడిగానిపల్లి గ్రామపంచాయతీలో టిడిపి నాయకుడు శీనప్ప అతని కోడలు కవితపై వైసీపీ నాయకులు దాడి చేశారంటూ గురువారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. శీనప్ప, కవిత స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వం మారినా తమపై దాడులు ఆగడం లేదని, ఇలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సదరు పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని తెలిపారు. దాడిలో గాయపడిన కవిత, శీనప్పలను టిడిపి కుప్పం నియోజకవర్గ దళిత నాయకులు సుబ్రమణి, నాయకులు మునస్వామి శెట్టి, మంజునాథ్ పరామర్శించి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ముద్దాయిలకు జైలు శిక్ష

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: పాత ఘర్షణలో ముద్దాయిలకు జైలు శిక్ష విధించినట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు. మండలంలోని వినాయకపురంకు చెందిన రాముడు భార్య సుభాషిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన మునిరాజు, మునిస్వామి, గణేష్ మోహన్, కామాక్షిలు 2018లో ఘర్షణ పడి సుభాషిని దారుణంగా కొట్టడంపై కేసు నమోదు అయ్యిందని తెలిపారు. దీనిపై కేసుకు సరైన సాక్షదారులను విచారించి నిందితులు ఐదు మందికి చిత్తూరు ప్రిన్సిపాల్ జడ్జి ఉమాదేవి ఆరు నెలలు జైలుశిక్ష రూ.1300ల జరిమానా విధించారని తెలిపారు. ఏపీపీ కృష్ణారెడ్డి బాధితులపై కేసు వాదించి బాధితులకు తగు న్యాయం చేశారని ఇందుకు సహకరించిన కోర్ట్ కానిస్టేబుల్స్ సామ్రాట్, సురేంద్రలను అభినందించారు.

మధుమోహన్ రెడ్డి మృతికి నివాళి

ప్రజాశక్తి- పెద్దపంజాణి : పుంగనూరు మాజీ సమితి అధ్యక్షులు రెడ్డివారి ఓబుల్‌రెడ్డి కుమారుడు, ఆర్.మధుమోహన్ రెడ్డి బుధవారం మృతి చెందారు. ఆయన మృతికి పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర్నాథ్ రెడ్డి సతీమణి రేణుకా రెడ్డి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులు మాజీ శాసనమండలి సభ్యులు రెడ్డెప్పరెడ్డి, మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ రెడ్డప్ప, నాయకులు భానుప్రతాప్ రెడ్డి, రామకృష్ణ, నాగరాజు రెడ్డి, వేమారెడ్డి, శ్రీరాములు ఉన్నారు.